
# రెండు కోరికలు

కె.బి. కృష్ణ



**సాయం సంధ్య వెలుగులో బంగారు రంగులో ఆ పల్లె వెలిగిపోతోంది. పశువులను ఇళ్లకు తోలుకెళ్తున్నారు. కొంతమంది ఇళ్ళ ముందు కళ్లాపి జల్లుతున్నారు. పశువులు వెళ్లేటప్పుడు లేచే దుమ్ము, కళ్ళాపి జల్లుతున్నప్పుడు వెలువడే తుంపర్లు, వాటి మధ్య నుండి వెలువడే సూర్యుని సంధ్యా కిరణాలు మానసికోల్లాసం కలిగించే వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.**

ఆ మూడు అంతస్థుల మేడ ముందు ఒక పనిపిల్ల పేడనీళ్ళు జల్లి ముగ్గు పెట్టడానికి తయారవుతోంది. ఇంతలో కారు వచ్చి ఇంటి ముందాగింది.

అందులో నుండి ఇద్దరు ముసలి దంపతులు దిగారు. పనిపిల్ల చేతిలో పని వది లేసి "అమ్మగోరూ, పెద్దమ్మగోరూ, పెద్దయ్యగోరూ వచ్చేరు" అంటూ లోపలకు పరుగు తీసింది.

లోపల నుండి మధ్య వయస్కులైన దంపతులు బయటకు వచ్చారు. వాళ్ళు కారు దిగుతున్న వృద్ధ దంపతులను చూస్తూ, ఒకరి ముఖాలు మరొకరు చూసుకొంటున్నారు. 'వీళ్ళు ఎందుకొచ్చారబ్బా' అంటున్నట్లుగా వున్నాయి వాళ్ల ముఖాలు.

"నాన్నగారూ ఇదేమిటి? ఆకస్మికంగా వచ్చారు. పోయిన నెలే కదా అన్నయ్య దగ్గరకు వెళ్లారు" అన్నాడు అతను. ఆ తండ్రికి వున్న ఇద్దరి కొడుకుల్లో చిన్న వాడు అతను.

ఆయనకు డెబ్భై సంవత్సరాలు వుంటాయి. పంచె లాల్చీ వేసుకుని పైన జరీ ఖద్దరు కండువా వేసుకున్నారు. పొడుగ్గా, దృఢంగా, వెనుకటి మునసబు, కరణాలలా వున్నారు. ఆయన ఆ ఊళ్ళోనూ, చుట్టుప్రక్కలా స్కూలు టీచరుగా పనిచేసి, చివర్లో హెడ్‌మాస్టర్‌గా పదవీ విరమణ చేశారు. ఆయన డెబ్భై సంవత్సరాల మనిషిలా కనపడరు. బ్లడ్‌ప్రెజర్, షుగర్ ఆయన్ను లొంగదీశాయి గాని లేకపోతే ఆయనతో ఎవరూ మామూలు నడక నడవలేరు. ఆయన అంత ఉత్సాహంగా వుంటారు.

"అత్తయ్యగారూ అసలే మీకు ఆయాసం. ఎందుకు శ్రమపడి తిరుగుతారు. పోయిన నెలలోనే కదా వచ్చారు" అంటూ కోడలు వచ్చింది. ఆమె పండు ముత్తైదువులా వుంటుంది. అత్తగారి వయసు అరవై పైనే వుంటాయి. బందారు లంక చేనేత చీర కట్టుకుని భుజం నిండా కొంగు కప్పుకుని, ముఖం నిండా పసుపుతో, నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టుతో, మెడలో నాలుగు పేటల చంద్రహారం, మంగళ సూత్రాల నానుతాడు, చేతులకు మామూలు గాజులతోపాటు డజను బంగారు గాజులు, సాక్షాత్తూ లక్ష్మీదేవిలా వుంటుంది ఆమె.

ఆమెకు అందరి తల్లులలాగే ఒక పిచ్చి వుంది. కొడుకులంటే అమితమైన ప్రేమ. అందునా చిన్న కొడుకంటే మరీను.

కాని, ఆమెకు చిన్నకొడుకు, కోడలు అప్పుడప్పుడు అంటున్న మాటలు పంచభక్ష్య పరమాన్నాలు భుజించేటప్పుడు పంటిక్రింద రాయిలా బాధిస్తుంటాయి.

ఆయన కారు దిగి, భార్య చేయి పట్టుకుని కారులోంచి దింపి "అరేయ్ చంటోడా, నేనూ అదే మాట అన్నానురా, మొన్నేకదా చిన్నాడి దగ్గర నుండి వచ్చేము అంటే, 'నాకు చిన్నబ్బు కలలోకి వచ్చాడు. అర్జెంటుగా చూడాల్సిందే' అని పట్టుబట్టిందిరా. అందుకని ఆలస్యమవుతుందని హైదరాబాదు నుండి కారు కట్టించుకుని వచ్చాం రా" అన్నారాయన.

ఆమె ఆయన్ను చిరుకోపంతో చూస్తోంది.

"కాదురా చిన్నబ్బు. ఎందుకోగానోయ్. ఎప్పుడూ నాకు ఇక్కడే ఈ ఊళ్ళోనే, ఈ మట్టివాసనే పీలుస్తూ వుండాలని వుంటుందిరా. నీ చేతుల్లోనే పోవాలని వుంటుందిరా" అందామె కొంగుతో కళ్ళు అద్దుకుంటూ.

అందరూ లోపలకు వెళ్ళి, కాళ్ళు చేతులు

కడుక్కుని దాహం తీసుకున్నాక, ఫలహారాలు తింటూ వుండగా -

తల్లి తండ్రి ఎదురుగా చిన్న కొడుకు కూర్చుని ఉన్నాడు.

తలుపు చాటున కోడలు ఉంది.

కుశల ప్రశ్నలు అయ్యాక -

"నాన్నగారూ అమ్మ చూడండి. ఎలా మాట్లాడుతుందో. నేను ఎన్నోసార్లు చెప్పాను. నాకు మీ ఇద్దరి ఆరోగ్యాల గురించే బెంగ అంతానూ. ఈ పల్లెటూర్లో, మీ ఇద్దరిలో ఎవరికైనా తేడా చేస్తే నేను ఎక్కడికి పరుగెత్తను? అందుకనే హైదరాబాదులో అన్నయ్య దగ్గర వుంటే, అక్కడ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వుంటాయి కాబట్టి అందరికీ బాగుంటుందని నా బాధ" అంటున్నాడు అబ్బాయి.

తండ్రి మౌనంగా వింటున్నాడు.

తల్లి బుగ్గన వేలేసుకుని "ఒరేయ్ మాకే మైనా అయిందే అనుకో, దగ్గరలో అందుబాటులో వున్న వైద్యం చేయిస్తావు, అంతే కాని వైద్యం చేయించకుండా చంపేస్తావా ఏమిటి?" అంది.

ఆమెకు చిన్న కొడుకు దగ్గరే వుండాలని బలీయమైన కోరిక.

ఆయన ఆమె మాటలకు అడ్డు వచ్చి "అది కాదే వాడు మన ఆరోగ్యం గురించి ముందస్తు ఆందోళన చెందుతున్నాడే. ఒక రకంగా ఆలోచిస్తే అదీ మంచిదే కదా -" అన్నారాయన.

"నన్ను అపార్థం చేసుకోకుండా మీరైనా సరిగా అవగాహన చేసుకున్నారు నాన్నగారూ పరిస్థితిని" అన్నాడు చిన్నబ్బు.

ఆ రాత్రి-

తమకోసం ఏర్పాటు చేసుకున్న గదిలో పడుకున్నారు ఆ తల్లీ తండ్రి.

"చిన్నబ్బు, చిన్నబ్బు అని పలవరించావు, చూశావు కదా వాడు నిక్షేపంగా వున్నాడు. ఏమైపోయాడో రాత్రి కలలో చిన్నబ్బుకి యాక్సిడెంటు అయింది' అని ఒకటే నసపెట్టి కారు కట్టించి మరీ తీసుకువచ్చావు. తెల్లార్లూ కారులో నిద్రలేదు. పడుకో" అంటున్నారాయన.

"చాల్లెండి. తల్లి మనసు మీకేం తెలుసును?" అందామె.

"ఓ యబ్బో గొప్ప తల్లి దిగొచ్చిందండీ. ఈవిడే కన్నది ఇద్దరు మగ నలుసుల్ని ఈ ప్రపంచంలో" అంటూ ఆమెను ఆటపట్టించ సాగారాయన.

ఇంతలో -

ప్రక్కనే వున్న చిన్న కొడుకు గదిలోంచి మాటలు వినపడసాగాయి. ఇద్దరూ వారి మాటలు వినసాగారు.

**కోడలు:** ఇదెక్కడి మేళం అండీ బాబూ. మళ్ళీ దాపురించేరు. వీళ్ళకు చాకిరీ చేసేటప్పటికి నాకు ఏదో మాయరోగం వచ్చేట్టుంది. మామూలు వంటలైతే చేసి పారేస్తాను గాని, ఈయనకు ఉప్పూ, కారం, తీపీ లేకుండానూ, ఆవిడకు ఆయాసం రాకుండా పత్యాలూ, ఇవన్నీ నావల్ల కాదు బాబూ -

**కొడుకు:** నేనూ అదే అనుకుంటున్నాను. అస్తమానూ మనమీద వచ్చిపడితే ఎలాగు? హైదరాబాదులో హాయిగా త్రీ బెడ్రూమ్ అపార్ట్‌మెంటులో చక్కగా ఒక బెడ్రూమ్ ఇచ్చాడు అన్నయ్య, అన్ని సౌకర్యాలతో. అది కాదని వచ్చి మన మీద పడతారు మనల్ని హాయిగా వుండనియ్యకుండా.

**కోడలు:** నేను రేపు మా పుట్టింటికి వెళ్ళిపోతాను. నన్ను పంపమని ఫోను వచ్చిందని చెప్పండి మీ అమ్మా నాన్నకు -


**కొడుకు:** అదేమిటే, రెండు రోజులు పోయాక నేనే పంపించేస్తానులే, ఎంత లేదన్నా మనకు మూడు అంతస్తుల మేడ, పదెకరాల పొలం వదిలేసి మనల్ని చూసుకోమన్నారు కదా. అన్నయ్యకు అపార్ట్‌మెంట్స్ వున్నాయి కాబట్టి, మేడ మనకే వస్తుంది. పొలంలో ఐదు ఎకరాలు తప్పక వస్తాయి. మరి ఈ మాత్రం కష్టపడకపోతే ఆస్తి ఎలా వస్తుందే.

**కోడలు:** చాల్లెండి. ఏ హైబీపీనో వచ్చి ముసలాయన కాస్తా గుటుక్కుమంటే, మన చావు మనకు వస్తుంది. మీకు బ్లడ్ ప్రెజర్ సంగతి తెలియదు. పట్టి అయోమయం -

**కొడుకు:** (ఆమె మాటలకు అడ్డువచ్చి) రాను రాను అవేం మాటలే. ఏదో చెప్పి పంపించేస్తానులే, మళ్ళీ మళ్ళీ రావద్దని. మనల్ని చూడాలని వుంటే ఫోన్ చేస్తే మనమే వస్తామని చెప్పి పంపించేస్తానులే.

**కోడలు:** ఏం చేస్తారో ఏమో నాకు

## పాలపిట్ట మనుగడకే ప్రమాదం



**మ**న రాష్ట్ర విహంగానికి పాలపిట్ట అంటారు. ఇండియన్ రోలర్ అని సామాన్యంగా అంటారు. బ్లూ జె అని శాస్త్రీయంగా అంటారు. ఆకాశనీలి రంగులో అందంగా ఉండేపక్షి. గాలిలో మొగ్గలు వేస్తూ కీటకాలని తింటూ గాలిలో సంచరించే ఈ పక్షిజాతికి నేడు ప్రమాదం సంభవించే సూచనలు కనబడుతున్నాయి.

దీనికి కారణం మారుతున్న మన వ్యవసాయపు అలవాట్లే. ఆధునిక సేద్యంలో పురుగు మందుల వాడకం అధికం అయింది. ఈ వాడకం పర్యావరణంలో ఎంతో అవాంఛనీయ మార్పు తీసుకొని వచ్చింది.

సాంప్రదాయ బద్ధంగా లభ్యమయ్యే విత్తనాలు కనుమరుగవుతున్నాయి. అధిక దిగుబడి ఇచ్చే విత్తనాల వాడకం అధికమయింది. దీనివల్ల దిగుబడి పెరిగినా కొత్త కొత్త చీడ పీడలు రూపొందాయి.

32 లక్షల హెక్టార్ల భూమి పతనం అయింది. మన రాష్ట్రం దేశంలో ఎరువుల వాడకంలో రెండో స్థానంలో ఉంది. నీటిపారుదల పెంపకంపల్ల దీర్ఘకాలిక విధానంలో మంచిది కాదు. ఆర్థికరీత్యా దెబ్బతీస్తుంది. పర్యావరణానికి తీరని ముప్పు కలిగిస్తుంది.

తెలంగాణాలోని వ్యవసాయం అంతా అస్తవ్యస్తం అయిపోతోంది. గోధుమ, జొన్న, మొక్కజొన్న, వరి వంటి వాటికి బదులు పత్తి, చెరకు, మిరప పెంచుతున్నారు.

పురుగుల మందు వాడకం వల్ల చీడ పీడలు 600 రెట్లు అధిక నిరోధక శక్తి పెంపొందించుకున్నాయి. ఇంకా పురుగుల మందు అధికంగా వాడవలసి వస్తోంది. పురుగుల మందు పక్షుల శరీరాలలోకి ప్రవేశిస్తోంది. దీనివల్ల పాలపిట్టలు క్రమంగా అదృశ్యమైపోతున్నాయి.

**- జమ్మి కోనేటిరావు**

తెలియదు, రేపు సాయంత్రం వరకూ గడువు.

మాటలు ఆగిపోయాయి.

తల్లితండ్రులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. కలవారింటి నుండి అమ్మాయిని తెచ్చుకుంటే వొదిగి వుండదనీ, బీదింటి పిల్లని కట్నం లేకుండా చేసుకున్నారు. కానీ ఆ అమ్మాయి ఇప్పుడు గొప్పగా ఆలోచనలు చేస్తూంది. చాలా ఎదిగిపోయింది.

సిరిసంపదలకు ఇంతటి మహత్తు వుందా! వాడేమిటిలా మారిపోతున్నాడు? అనుకున్నారు ఇద్దరూ –

పల్లెలో తెల్లవారింది. దూడల మెడలకు వుండే చిన్న గజ్జెల చప్పుళ్ళతో, పశువులు అంబా అని అరుస్తూ మేతకు వెళ్తున్నాయి. అక్కడక్కడ ఆలస్యంగా లేచిన కోళ్ళు అప్పుడే తెల్లవారిందని కూస్తున్నాయి. ఇళ్ళముందు వాకిళ్ళు ఊడుస్తుంటే దుమ్ములేస్తుంది. సూర్య కిరణాల కాంతి చెట్ల నీడల్లో నుండి ముదుసలి తల్లి తండ్రుల పడకగదిలోకి ప్రసరిస్తోంది. ఆ కాంతి నిండా దుమ్ము వుంది. వారి మనసుల నిండా గూడు కట్టుకున్న ఆవేదనలాగే–

ఆయన బయటకు వస్తూనే –

"చంటోడా ఒక ఆటో పిలిపించు. అమ్మ ఊరు వెళ్ళాలంటూంది" అన్నాడు.

"అదేంటి నాన్నగారూ, నిన్న సాయంత్రమే గదా వచ్చారు" అంటున్నాడు చిన్నబ్బు, అతని వెనకాలే చిన్నబుచ్చుకున్న ముఖంతో కోడలు. రాత్రి తమ సంభాషణ విన్నారేమోనని అనుమానం. అసలైతే వాళ్ళు వినాలనే గట్టిగా అన్ని మాటలు మాట్లాడింది, మాట్లాడించింది భర్త చేత.

"అదేంటి మామయ్యగారూ ఎలాగూ వచ్చారు కదా. నాలుగు రోజులు వుండి వెళ్ళండి" అంది పెదాలనుండి వచ్చిన మాటలతో.

"కాదమ్మా, నాకు రేపు అర్జెంటుగా హాజరు కావాల్సిన కార్యక్రమం ఒకటి వుంది. మీ అత్తగారి ఆందోళనతో, నేను బుద్ధిలేకుండా, ఆలోచించకుండా తెలివి తక్కువగా వచ్చేశాను. ఎంతలే మళ్ళీ వెంటనే మీ అత్తగార్ని ఏదో కలరాకపోదు. మేము రాక తప్పదు" అన్నారాయన.

ఈ లోగా ఆటో వచ్చింది.

ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు.

"బస్సెక్కించడానికి వస్తాను నాన్నగారూ" అంటూ బయలుదేరబోయాడు చిన్నబ్బు.

"వొద్దురా ఆటోవాడు మమ్మల్ని ఎక్కిస్తాడులే. ఎరుగున్నాడే కదా" అంటూ అతన్ని ఆపుచేశారు.

ఆ తల్లి మౌనంగా, బాధతో మిన్నకుండిపోయింది.

"చిన్నబ్బా వస్తానురా" అన్నట్లుగా చూసింది వాడిని. కోడలితో "అమ్మాయి జాగ్రత్తగా వుండండి" అని చెప్పింది ఆటో కదిలేక, అది వాళ్ళకు వినిపించిందో లేదో.

"అభిమానాలు, ఆప్యాయతలు, అనురాగాలు, ప్రేమా తెలియాలంటే పిల్లలు తప్పనిసరిగా వుండాలనుకుంటానే, అందుకనే చంటోడికి పిల్లలు పుట్టలేదేమో" అంటున్నారాయన.

ఆయన నోటికి ఆమె చేయి అడ్డుపెట్టి, తప్పు అన్నట్లుగా "సిరిసంపదలు కూడా ఉండకూడదండీ" అంది.

నాలుగు రోజులు గడిచాయి.

పల్లెలో చిన్నబ్బుకి ఒక రిజిస్టర్డ్ కవర్ వచ్చింది. అందులో అతని తల్లీ, తండ్రీ కనిపించారు.

"చిన్నబ్బా,

తన తల్లి తండ్రి శతాయుష్షుగా బ్రతికి ఉండాలనీ, వాళ్ళకు ఎటువంటి అనారోగ్యాలు కనీసం ఊహల్లో కూడా ఊహించలేని కొడుకుల్ని చూశాను. అలాంటి కొడుకుల గురించి విన్నాను. కాని దీనికి విరుద్ధంగా అమ్మా నేనూ ఎప్పుడు మీ ఇంటికి వచ్చినా. మీ ఇంట్లో వుండగా మాకు ఏదైనా అయితే వైద్య సౌకర్యాలు లేవు ఎలాగా అని ముందు చూపు చూసే నీలాంటి కొడుకు వుండడం, మేము ఎంత అదృష్టం చేసుకుంటే జరిగిందంటావ్.

మీ అమ్మ పిచ్చి తల్లిరా.

అస్తమానూ చిన్నబ్బు, చిన్నబ్బులు అని ఏడుస్తుంది. కాని ఆమె నిన్ను చూడడానికి వచ్చినప్పుడల్లా, నువ్వు, కోడలు, మా ఆరోగ్యాల గురించి ముందస్తు ఆందోళన చెందడం చూసి పిచ్చితల్లి బిక్క చచ్చిపోయేది.

బాబూ, నువ్వు ఇంక ఈ ముందస్తు ఆందోళన కార్యక్రమం కట్టిపెట్టు. మేము శాశ్వతంగా మీ అన్నయ్య దగ్గరే ఉండిపోతాం. సాధ్యమైనంత వరకూ మీ అమ్మను నిన్ను చూడాలనే ఆకాంక్ష అణిచిపెట్టుకోమని చెప్పాను. ఆ తరువాత ఆమె ఇష్టం.

ఇకపోతే మావి రెండు కోరికలు –

ఒకటి –

మీ అమ్మగాని, నేనుగాని, ఇద్దరం ఒకేసారి గాని మరణిస్తే మా భౌతికకాయాల్ని దయచేసి ముట్టుకోకు –

రెండు –

మన ఊళ్లో మూడంతస్తుల మేడ, పదెకరాల తోట పెద్దాడికి వ్రాసేశాను. నువ్వు, మీ ఆవిడ ఉన్నన్నాళ్ళు ఆ మేడలో ఉండవచ్చును. అయితే మీకుచెందే హక్కులు లేవు.

ఒక విషయం

అన్నయ్య ఆ మేడలో హైస్కూలు పెట్టిస్తానన్నాడు మా పేరు మీద, కావాలన్నప్పుడు ఇచ్చేయండి ఖాళీ చేసి.

నీకు సంతానం కలిగితే ప్రపంచ జ్ఞానం కలుగుతుంది. అది జరగాలని మేము నమ్ముకున్న దేముడిని ప్రార్థిస్తున్నాము. లక్ష్మీ సౌభాగ్యవతి కోడలికి మా ఆశీస్సులు"

ఉత్తరం చదువుతున్న చిన్నబ్బు వెనకనే వున్న అతని భార్య కళ్ళల్లోంచి నిప్పురవ్వలు వెలువడుతున్నట్లుగా, అతని ముఖానికి వేడిగా తాకుతున్నాయి ఆమె నిట్టూర్పులు. ❋

## సింగిల్ పేజీ కథలకు ఆహ్వానం

'ప్రియదత్త' సకుటుంబ సచిత్ర వార పత్రికలో సింగిల్ పేజీ కథలు ప్రచురణార్థం రచయిత(త్రు)లకు ఆహ్వానం పలుకుతున్నాం. సింగిల్ పేజీ కథలు పంపేవారు ఈ క్రింది సూచనలు గమనింప కోరతాము.

☆ కథ అర ఠావు సైజులో 3 పేజీలు మించరాదు.

☆ పేజీకి ఒక వైపు మాత్రమే రాయాలి.

☆ కథ తమ స్వీయ రచన అని, అముద్రితమని, హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి.

☆ కథ చివరిభాగంలో, చిరునామాను వ్రాయాలి.

☆ కథలను తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచాలి. – ఎడిటర్